నేటి బంద్‌ను విజయవంతం చేయాలి

మల్లాపూర్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ గురువారం నిర్వహించ తలపెట్టిన దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని భారత రాష్ట్ర ట్రేడ్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి బూరుగు మారుతీరావు పిలుపునిచ్చారు. ఉప్పల్ నియోజకవర్గంలోని మల్లాపూర్, నాచారం, చర్లపల్లి, ఉప్పల్, మౌలాలి వంటి పారిశ్రామికవాడల్లో స్వచ్ఛందంగా యాజమాన్యాలు బంద్ పాటించాలని కోరారు.

ఎల్‌ఓసీ మంజూరు



మల్కాజిగిరి: ఈస్ట్ ఆనంద్‌బాగ్‌కు చెందిన భవాని సాయిరాం సింగ్ ఆరోగ్యం బాగాలేదు. చికిత్స కోసం సీఎం రిలీఫ్ ఫండ్‌కు దరఖాస్తు చేసుకోగా రూ.1.20 లక్షల ఎల్‌ఓసీ మంజూరైంది. ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి గురువారం సాయిరాంసింగ్‌కు ఎల్‌ఓసీ అందజేశారు.

లయోలాలో కంప్యూటర్స్ డే

అల్వాల్: అల్వాల్‌లోని లయోలా అకాడమీ డిగ్రీ, పీజీ కళాశాలలో గురువారం వరల్డ్ కంప్యూటర్స్ డే సందర్భంగా డిపార్టుమెంట్ హెడ్ ఎస్.స్వప్న ఆధ్వర్యంలో బీఎస్సీ కంప్యూటర్ సైన్స్, ఇంజనీరింగ్ డిపార్టుమెంట్ బైట్ ఫీస్టా కార్యక్రమం నిర్వహించారు. సైక్‌ఎస్ టెక్నాలజీ ఫౌండర్, సీఈవో సతీష్ ఎల్లంకి, లయోలా అకాడమీ ప్రిన్సిపల్ రెవరెండ్ ఫాదర్ డాక్టర్ ఎల్.జోజిరెడ్డి హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. కంప్యూటర్స్‌కి సంబంధించి కోడింగ్ క్రాఫ్ట్ క్లాష్, ఎస్కేప్ రూమ్, మైండ్ మేజ్, మ్యాడ్ యాడ్ వంటి వివిధ పోటీలు నిర్వహించి గెలిచిన వారికి బహుమతులు అందచేశారు. అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

త్వరలో అందుబాటులోకి చర్లపల్లి రైల్వే టెర్మినల్



చర్లపల్లి టెర్మినల్ అభివృద్ధి పనులపై సమీక్షించిన బోర్డు సభ్యులు

కుషాయిగూడ: అత్యాధునిక హంగులతో రూపుదిద్దుకుంటున్న చర్లపల్లి రైల్వే టెర్మినల్ త్వరలోనే అందుబాటులోకి రానుందని చర్లపల్లి రైల్వే టెర్మినల్ అభివృద్ధి బోర్డు కమిటీ సభ్యులు నాదం నర్సింగరావు, లక్ష్మణ్‌గౌడ్, చల్ల ప్రభాకర్ అన్నారు. మౌలాలి రైల్వే స్టేషన్‌లో రైల్వే చీఫ్ కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ ఏకే సిన్హాతో గురువారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా చర్లపల్లి టెర్మినల్ అభివృద్ధి పనులపై ఆయనతో సమీక్షించారు.

తల్లీకూతుళ్ల అదృశ్యం



తారాదేవి, ఉషా(ఫైల్)

అల్వాల్: తల్లీకూతుళ్ల అదృశ్యమైన ఘటన నేరేడ్‌మెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఓల్డ్ సఫిల్‌గూడలో నివసించే తారాదేవి(37), కుమార్తె ఉష(10), కుమారుడితో కలిసి ఉంటున్నారు. తారాదేవి ఫాస్ట్‌ఫుడ్ సెంటర్‌లో పనిచేస్తోంది. ఈ నెల 13వ తేదీన వీరు ఇద్దరు బయటకు వెళ్లి ఇంటికి తిరిగిరాలేదు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

పారిశుద్ధ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి

కీసర: పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కీసర ప్రత్యేక అధికారి నంద కిషోర్ అన్నారు. గురువారం గ్రామ పంచాయతీ పరిధిలో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన గ్రామ సభలో ఆయన మాట్లాడుతూ.. పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే ప్రజలు ఆరోగ్యంగా ఉంటారన్నారు. అందుకే పారిశుద్ధ్య నిర్వహణ పనులు సవ్యంగా కొనసాగేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. మండల పంచాయతీ అధికారి వినూత్నారెడ్డి, వైస్ ఎంపీపీ సత్తిరెడ్డి, వివిధ పార్టీల నాయకులు, మాజీ వార్డు సభ్యులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు

పరిసరాల పరిశుభ్రతపై శ్రద్ధ తీసుకోవాలి

మేడ్చల్: గ్రామాల్లో అధికారులు పారిశుద్ధ్య సమస్యలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఎంపీపీ రజితరాజమల్లారెడ్డి అన్నారు. మండలంలోని డబీల్‌పూర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన గ్రామసభలో పాల్గొని మాట్లాడారు. అధికారులు పారిశుద్ధ్య సమస్యను పట్టించుకుని ఎప్పటికప్పుడు పరిసరాల పరిశుభ్రతపై శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. గ్రామసభలో జిల్లా కో ఆప్షన్ సభ్యుడు గౌస్, మాజీ సర్పంచ్‌లు రాజమల్లారెడ్డి, గీత భాగ్యారెడ్డి, నాయకులు అశోక్, శ్రీరాంరెడ్డి, మల్లేష్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు సన్మానం

ఘట్‌కేసర్: ఘట్‌కేసర్ మండల తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించిన రజనిని మున్సిపల్ చైర్ పర్సన్ పావనీజంగయ్య, వైస్ చైర్మన్ మాధవరెడ్డి, బీఆర్ఎస్ మున్సిపల్ అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో గురువారం సన్మానించారు. తహసీల్దార్ కార్యాలయంలో ఆమెను కలిసి శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేశారు. కౌన్సిలర్లు వెంకట్‌రెడ్డి, ఆంజనేయులుగౌడ్, జహంగీర్, రవీందర్, ఎఫ్ఎస్‌సీఎస్ డైరెక్టర్ లక్ష్మారెడ్డి, జంగయ్యయాదవ్, రాధాకష్ణముదిరాజ్, నర్సింగ్‌రావు, సత్యనారాయణ, కృపానిధి, పోచయ్యముదిరాజ్, యాదగిరి, శ్రీనివాస్‌రెడ్డి విజయ్‌గౌడ్ పాల్గొన్నారు.

అదుపుతప్పి కారు బోల్తా.. యువకుడి మృతి

యాదగిరిగుట్ట రూరల్: అదుపుతప్పి కారు బోల్తా పడటంతో ఓ యువకుడు మృతిచెందాడు. మరో నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట మండలం వంగపల్లి గ్రామ సమీపంలో హైదరాబాద్–వరంగల్ జాతీయ రహదారిపై గురువారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా దమ్మాయిగూడకు చెందిన రాహుల్(25)తో పాటు కంసాని మనోజ్‌రెడ్డి, దాసరి సాయిచరణ్‌రెడ్డి, రాచపాట కార్తీక్, గంప రాజు కలిసి బుధవారం ఉదయం కారులో జనగామ జిల్లాలో తమ స్నేహితుడి పెళ్లికి వెళ్లారు. పెళ్లి అనంతరం గురువారం తెల్లవారుజామున జనగామ నుంచి హైదరాబాద్‌కు తిరుగు ప్రయాణమయ్యారు. యాదగిరిగుట్ట మండలం వంగపల్లి గ్రామ సమీపంలోకి రాగానే అతివేగంతో ఉన్న కారు మోటకొండూర్ జంక్షన్ వద్ద అదుపుతప్పి బోల్తా పడింది. కారులో ప్రయాణిస్తున్న రాహుల్ అక్కడికక్కడే మృతిచెందాడు. మిగతా నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భువనగిరి ఏరియా ఆస్పత్రికి తరలించారు. క్షతగాత్రులను కూడా ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రమేష్ తెలిపారు.

ఘనంగా సేవాలాల్ జయంతి వేడుకలు

అల్వాల్: గిరిజనుల ఆరాధ్య దైవం సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకలు గురువారం లంబాడ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో అల్వాల్ ఇందిరా గాంధీ విగ్రహం వద్ద ఖానాజిగూడలో నిర్వహించారు. మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి హాజరై సేవాలాల్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. నాయకులు అనిల్‌కిషోర్‌గౌడ్, కల్లెపల్లి సంపత్, లంబాడ సంక్షేమ సంఘం నాయకులు మున్నానాయక్, రవినాయక్, గోపాల్‌నాయక్, రాజునాయక్, హరినాయక్, బాలునాయక్, బాలరాజు నాయక్, లక్ష్మణ్‌నాయక్, స్థానిక నాయకులు సయ్యద్ మోసిన్, ప్రభాకర్, అశోక్, అమృత తదితరులు పాల్గొన్నారు.



అల్వాల్‌లో సేవాలాల్ జయంతి వేడుకల్లో ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి తదితరులు

సంత్ సేవాలాల్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలి..

మేడిపల్లి: పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో బంజారా వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం సద్గురు శ్రీసేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా నగర మేయర్ జక్క వెంకట్‌రెడ్డి హాజరై సంత్ సేవాలాల్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సంత్ సేవాలాల్ ఆశయాలను ముందుకు తీసుకుపోవాలని ఆయన కొనియాడారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు సుభాష్ నాయక్, దొంతిరి హరిశంకర్‌రెడ్డి, నాయకులు బైటింటి ఈశ్వర్‌రెడ్డి, పాశం బుచ్చియాదవ్, అసోసియేషన్ సభ్యులు, బంజారా కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

చర్లపల్లిలో ఘనంగా..

కుషాయిగూడ: గిరిజనుల ఆరాధ్యదైవం సంత్ శ్రీసేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకలను గురువారం చర్లపల్లిలో ఘనంగా నిర్వహించారు. కార్పొరేటర్లు బొంతు శ్రీదేవి, ప్రభుదాస్ హాజరై సేవాలాల్ మహారాజ్ చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో హరినాయక్, స్థానిక నేతలు నాగిళ్ల బాల్‌రెడ్డి, శ్రీకాంత్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకల్లో పీర్జాదిగూడ మేయర్ జక్క వెంకట్‌రెడ్డి



సంత్ సేవాలాల్ జయంతి వేడుకల్లో కార్పొరేటర్లు బొంతు శ్రీదేవి, ప్రభుదాస్

వైభవంగా శ్రీవారి కల్యాణం

కుషాయిగూడ: మీర్‌పేట్–హెచ్‌బీకాలనీ డివిజన్ మంగపురం కాలనీలోని శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం శ్రీవారి కల్యాణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ మహోత్సవానికి ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. అనంతరం పుర వీధుల్లో స్వామివారిని ఊరేగించారు. కార్యక్రమంలో ఉప్పల్ కాంగ్రెస్ ఇన్‌చార్జి మందముల పరమేశ్వర్‌రెడ్డి, కార్పొరేటర్ ప్రభుదాస్, మాజీ కార్పొరేటర్ గుండారపు శ్రీనివాస్‌రెడ్డి, ఆలయ ఈఓ రవీంద్రరెడ్డి, స్థానిక నేతలు జలగం వెంకటేష్, గుమ్మడి జంపాల్‌రెడ్డి, కృష్ణమూర్తి, సమ్మని మురళిచారి తదితరులు పాల్గొన్నారు.



స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పిస్తున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

రాజ్యసభ అభ్యర్థి రవిచంద్రను కలిసిన ఎమ్మెల్యే



ఉప్పల్: బీఆర్ఎస్ బలపరిచిన రాజ్యసభ అభ్యర్థి వద్దిరాజు రవిచంద్రను నామినేషన్ సందర్భంగా ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ఆయనను కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. బీఆర్ఎస్ నేతలు బన్నాల ప్రవీణ్, గంధం నాగేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

శ్రీకనక దుర్గ అమ్మవారి సేవలో..



రామంతాపూర్: డివిజన్ కార్పొరేటర్ బండారు శ్రీవాణి వెంకట్‌రావు తన జన్మదినం సందర్భంగా గురువారం విజయవాడ శ్రీకనకదుర్గ అమ్మవారిని దర్శించుకుని ఆలయ ప్రధాన అర్చకుల ఆశీర్వచనాలు తీసుకున్నారు. కార్పొరేటర్ శ్రీవాణి మాట్లాడుతూ డివిజన్ మరింత అభివృద్ధి చెందాలని అమ్మవారిని మొక్కుకున్నట్లు తెలిపారు.

కమిషనర్‌ను కలిసిన మేయర్

బోడుప్పల్: బోడుప్పల్ నగర పాలక సంస్థ నూతన కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన రామలింగంను మేయర్ సామల బుచ్చిరెడ్డి గురువారం కలిసి అభినందించారు. అనంతరం బోడుప్పల్‌లో చేపట్టిన అభివృద్ధి పనులు, పెండింగ్ పనులు, ఇతర సమస్యలపై చర్చించారు. అనంతరం శాలువాతో కమిషనర్‌ను సత్కరించారు. కమిషనర్‌ను కలిసిన వారిలో సీనియర్ నాయకులు కాటపల్లి రాంచంద్రారెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ బి.నారాయణరెడ్డి ఉన్నారు.



ఫొటో కాంటెస్ట్.. వండర్స్ ఆఫ్ ద వరల్డ్..

సాక్షి, సిటీబ్యూరో: నగరంలోని ఔత్సాహిక ఫొటో/ వీడియో గ్రాఫర్ల కోసం వరల్డ్‌వైడ్ ఫండ్ ఫర్ నేచర్ ఇండియా (డబ్ల్యుడబ్ల్యుఎఫ్‌ఇండియా), నికాన్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ సంస్థల ఆధ్వర్యంలో వండర్స్ ఆఫ్ ది వైల్డ్ పేరిట పోటీని నిర్వహిస్తున్నారు. ఈ విషయాన్ని నిర్వాహక సంస్థ ప్రతినిధులు తెలిపారు. ప్రకృతి, వన్యప్రాణుల జీవనం పట్ల ఆసక్తి కలిగిన ఫొటో/వీడియోగ్రాఫర్లు కెమెరాల్లో బంధించిన అద్భుత దృశ్యాలతో ఈ కాంటెస్ట్‌లో పాల్గొనవచ్చునని, మార్చి 3లోగా ఎంట్రీలను https://capturewithnikon.in/wonders-of-the-wild పంపాలని కోరారు. విజేతలకు రూ.8 లక్షల విలువైన బహుమతులతో పాటు, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు లభించే అవకాశం కూడా ఉంటుందన్నారు.

వైభవంగా మల్లన్న జాతర

మౌలాలి: మౌలాలిలో గురువారం మల్లన్న జాతర వైభవంగా జరిగింది. జాతరకు మాజీ మంత్రి, బీజేపీ నేత ఈటల రాజేందర్ హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మౌలాలి కార్పొరేటర్ సునీతాశేఖర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సహాయం అందజేత



గౌతంనగర్: గౌతంనగర్ డివిజన్ మల్లిఖార్జుననగర్‌కు చెందిన సుజాత అనారోగ్యంతో మృతిచెందింది. విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ నాయకులు మేకల రాముయాదవ్ సహకారంతో భైరు అనిల్ గురువారం సుజాత కుటుంబసభ్యులకు రూ.10 ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

దళితులపై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి



మల్లాపూర్: రంగారెడ్డి జిల్లా జొన్నాడ గ్రామంలో దళిత క్రైస్తవులపై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని టీపీసీసీ ఎస్సీ సెల్ కన్వీనర్ హెచ్ఆర్ మోహన్ డిమాండ్ చేశారు. గురువారం నాచారంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశవ్యాప్తంగా మత విద్వేషాలు రెచ్చగొట్టేవారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. మోదీ వచ్చిన తర్వాత దేశవ్యాప్తంగా దళితులపై దాడులు పెరగాయన్నారు. సమావేశంలో బొజ్జ యాదగిరి, రమేష్, సంపత్, వెంకన్న, కల్యాణ్, బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

త్రిలేశ్వర్‌రావుకు సన్మానం



మేడిపల్లి: పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ నూతన కమిషనర్‌గా త్రిలేశ్వర్‌రావు గురువారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మేయర్ జక్కా వెంకట్‌రెడ్డి కమిషనర్‌ను సత్కరించి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్పొరేటర్లు సుభాష్ నాయక్, కొడె పోచయ్య, దొంతిరి హరిశంకర్‌రెడ్డి, నాయకులు బైటింటి ఈశ్వర్‌రెడ్డి, చెరుకు పెంటయ్య, జావీద్ ఖాన్, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గంజాయి ముఠా అరెస్టు



అల్వాల్: వైజాగ్ నుంచి అల్వాల్‌కు గంజాయి తరలిస్తున్న ముఠాను అల్వాల్ పోలీసులు, మేడ్చల్ ఎస్ఓటీ పోలీసులు అరెస్టు చేసి వారి నుంచి 31 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. సీఐ రాహుల్‌దేవ్ తెలిపిన వివరాల ప్రకారం.. విశ్వసనీయ సమాచారం మేరకు అల్వాల్ లక్ష్మీకళ టాకీస్ సమీపంలో గంజాయి తరలిస్తున్న ముఠాను పట్టుకున్నారు. సోమేశ్వర్‌రావు, రాజశేఖర్, పండును అరెస్టు చేయగా మరో ఇద్దరు కొండబాబు, ఇంద్రకుమార్ పరారయ్యారు. వీరి నుంచి 31కిలోల గంజాయిని స్వాధీనం చేస్తున్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేసుకున్నారు.

విజయ సంకల్ప యాత్రను విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న చాడా సురేష్‌రెడ్డి

మల్కాజిగిరి: మల్కాజిగిరి నియోజకవర్గంలో ఈ నెల 24న జరిగే విజయ సంకల్ప యాత్రను విజయవంతం చేయాలని మాజీ ఎంపీ యాత్ర మల్కాజిగిరి అసెంబ్లీ ఇన్‌చార్జి చాడా వెంకట్ రెడ్డి పిలుపునిచ్చారు. గురువారం మల్కాజిగిరి పద్మావతి ఫంక్షన్ హాల్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 20వ తేదీన ఘట్‌కేసర్‌లో ప్రారంభమై 24న మౌలాలికి చేరుతుందన్నారు. అక్కడ నుంచి ఆనంద్‌బాగ్, వినాయకనగర్, నేరెడ్‌మెట్, యాప్రాల్ మీదుగా జరుగుతుందన్నారు. యాత్రను విజయవంతం చేయడానికి వివిధ కమిటీలను ఏర్పాటు చేశామన్నారు. నాయకులు ఆర్.కె.శ్రీనివాస్, వాశంశెట్టి శ్రీనివాస్, డీఎస్ వెంకటేష్, బాలచందర్‌గౌడ్, నాగరాజు, సునీల్‌యాదవ్, శ్రీనివాస్ ముదిరాజ్, నవీన్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

కుషాయిగూడ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గం



నూతన కార్యవర్గానికి అభినందనలు తెలుపుతున్న అసోసియేషన్ ప్రతినిధులు

కుషాయిగూడ: కుషాయిగూడ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గం గురువారం ఏకగ్రీవంగా ఎన్నికైంది. అధ్యక్షుడుగా సింగిరెడ్డి సోమశేఖర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా పనగట్ల చక్రపాణిగౌడ్, కోశాధికారిగా చిత్తుల కిషోర్‌గౌడ్ ఎన్నికయ్యారు. సీనియర్ సిటిజన్ కమిటీ కన్వీనర్‌గా చల్లా వీరేషంను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు మాట్లాడుతూ తనపై విశ్వాసంతో మరోమారు అవకాశం కల్పించిన అసోసియేషన్ ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. అసోసియేషన్ ప్రాతిపదికగా కుషాయిగూడను అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానన్నారు. అనంతరం మాజీ కార్పొరేటర్ సింగిరెడ్డి ధన్‌పాల్‌రెడ్డి, పాండాల శివకుమార్‌గౌడ్ వారిని అభినందించి సత్కరించారు.

ఆకట్టుకున్న థింక్ రూం డే వేడుకలు



వేడుకల్లో చిన్నారులు

బోడుప్పల్: లోటస్ ల్యాప్ పబ్లిక్ స్కూల్‌లో గురువారం నిర్వహించిన థింక్ రూం డే జీ–20 వేడుకలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ప్రైమరీ విద్యార్థులు పాల్గొని రాష్ట్రాలు, రాష్ట్రాల ప్రత్యేకతలు, వాటి ప్రాముఖ్యతను నృత్య రూపంలో, నమూనా రూపంలో ప్రదర్శించారు. కార్యక్రమానికి పాఠశాల చైర్మన్ కోమటిరెడ్డి గోపాల్‌రెడ్డి హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణాన్ని ఎలా కాపాడుకోవాలి. నీళ్లు, విద్యుత్ వల్ల కలిగే ప్రయోజనాలు, భావితరాల కోసం నీరు, విద్యుత్ అవసరాలు గురించి చక్కగా వివరించారు. ప్రిన్సిపాల్ లక్ష్మీశారద, వైస్ ప్రిన్సిపాల్ నాగలక్ష్మి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఎలక్టోరల్ బాండ్‌లపై సుప్రీం కోర్టు తీర్పు హర్షణీయం



మాట్లాడుతున్న వీఎస్ బోస్

కాప్రా: ఎలక్టోరల్ బాండ్‌లపై సుప్రీంకోర్టు తీర్పు హర్షణీయమని, తీర్పును సీపీఐ స్వాగతిస్తోందని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వీఎస్ బోస్ అన్నారు. ఎలక్టోరల్ బాండ్లపై దేశ అత్యున్నత న్యాయస్థానం ఇచ్చిన తీర్పుపై స్పందిస్తూ ఆయన గురువారం ఏఎస్‌రావునగర్‌లో మీడియాతో మాట్లాడారు. ఈ బాండ్లు రాజ్యాంగ విరుద్ధమని సుప్రీంకోర్టు చారిత్రాత్మక తీర్పును వెలువరించిందని, ఈ బాండ్ల వల్ల బీజేపీ మాత్రమే లబ్ధి పొందుతోందని విమర్శించారు. బాండ్ల రూపంలో వచ్చిన నగదును తక్షణమే ఆర్బీఐ స్వాధీనం చేసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ నేతలు దామోదర్‌రెడ్డి, శంకర్‌రావు, ధర్మేంద్ర, సత్యప్రసాద్, సాయిలు, అశోక్, ప్రకాష్, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలి

ఉప్పల్: అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలని చిలుకానగర్ కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ ముదిరాజ్ అధికారులకు సూచించారు. చిలుకానగర్ డివిజన్‌లోని బీరప్పగడ్డ వద్ద చేపడుతున్న మురుగు నీటి పైపులైన్ పనులను గురువారం స్థానికులతో కలిసి పరిశీలించారు. నాణ్యత ప్రమాణాల్లో రాజీ పడొద్దని, చేసిన పనులు పది కాలాల పాటు నిలిచే విధంగా చేయాలన్నారు. స్థానికంగా ఎలాంటి సమస్యలు ఉన్నా నేరుగా తనకు కాల్ చేసి తెలపాలని కార్పొరేటర్ సూచించారు. కార్యక్రమంలో ఏఈ రాజ్‌కుమార్, బన్నాల ప్రవీణ్ ముదిరాజ్, జగన్ తదితరులు పాల్గొన్నారు.



చిలుకానగర్ బీరప్పగడ్డలో పైప్‌లైన్ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ బన్నాల గీత

రిపోర్టర్ పేరుతో బెదిరింపులు

పోలీసులకు ఫిర్యాదు.. కేసు నమోదు..

కుషాయిగూడ: పెంట్‌హౌజ్ నిర్మాణం చేసిన ఓ నిర్మాణదారుడి వద్ద డబ్బులు డిమాండ్ చేసి బెదిరింపులకు పాల్పడ్డ రిపోర్టర్‌పై కేసు నమోదు చేసిన ఘటన గురువారం కుషాయిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో వెలుగులోకి వచ్చింది. కాప్రా, భవానీనగర్‌కు చెందిన సింగిరెడ్డి రాజిరెడ్డి ఏఎస్ రావునగర్, త్యాగరాయనగర్‌లో ఇంటి నిర్మాణం చేసి తన ఇంటిపై పెంట్‌హౌజ్ నిర్మాణం చేశాడు. ఈ క్రమంలో మల్లికార్జున్ అనే వ్యక్తి రాజిరెడ్డికి తరచూ ఫోన్ చేసి బెదిరింపులకు పాల్పడ్డాడు. రూ.3 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశాడు. జీహెచ్ఎంసీ అధికారులకు ఫిర్యాదు చేసి పెంట్‌హౌజ్‌ను కూల్చివేయిస్తానంటూ బెదిరించాడు. దీంతో నిర్మాణదారుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. మల్కాజిగిరి సెకండ్ అడిషనల్ ఎంఎం కోర్టు ఆదేశాల మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ ఉపేందర్‌యాదవ్ తెలిపారు.

ఘనంగా బచ్‌పన్ స్కూల్ వార్షికోత్సవం

మేడిపల్లి: ఉప్పల్ క్యాంపస్ బచ్‌పన్ స్కూల్ వార్షికోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. వేడుకలకు ముఖ్యఅతిథులుగా డైరెక్టర్లు శ్రీకాంత్ రెడ్డి, రూపారెడ్డి, కౌశిక్‌రెడ్డి హాజరై విద్యార్థుల ఆటపాటలను వీక్షించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యార్థులకు చదువుతో పాటు ఆటపాటలను నిర్వహించాలని అన్నారు. కార్యక్రమంలో స్కూలు ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.





అనాథాశ్రమంలో అన్నదానం

బోడుప్పల్: చెంగిచర్ల గ్రామపంచాయతీ మాజీ వార్డు సభ్యులు ఏర్పుల వెంకటేశం తన పుట్టిన రోజును పురస్కరించుకుని స్థానికంగా ఉన్న అనాథ ఆశ్రమంలో అన్నదానం నిర్వహించారు. ఆశ్రమంలోని అందరికి అన్నం, పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వెంకటేశం మాట్లాడుతూ పేదలకు తమవంతు చేయూత అందివ్వాలని కోరారు.